ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

సోమవారం 6 జనవరి 2025 | 5





కాకినాడలో ముగ్గులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

కాకినాడ జిల్లా



కోనసీమ జిల్లా



తూర్పుగోదావరి జిల్లా



ముగ్గుల పండగ

'ఏబీఎన్- ఆంధ్రజ్యోతి' ముత్యాల ముగ్గుల పోటీలు

సంక్రాంతి పండుగ ముందే వచ్చే సింది.. ముగ్గులతో కళ తెచ్చేసింది.. సంక్రాంతి పండుగ ముందు రావడం ఏమిటా అని ఆశ్చర్యపోతున్నారా.. అదే మరి 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ప్రత్యేకత.. తెలుగింట సంప్రదాయంలో భాగంగా ప్రతి ఏడాది 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా సంక్రాం తి పండుగను తలపిం చేలా ఏర్పాట్లు చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజ మహేంద్రవరం షిర్డిసాయి విద్యానికేతన్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోన సీమ జిల్లాలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో శనివారం ముగ్గుల పోటీ లు నిర్వహించారు.కాకినాడ జిల్లాలో మెక్‌లారిన్ హైస్కూల్ ప్రాంగణంలో ఆదివా రంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చారు. ఉత్సాహంగా ముగ్గులు వేశారు.ఆయా ప్రాంగణాలు భువిపై చుక్కలు దిగివచ్చా యా అన్నట్టు మెరిశాయి..మహిళలు ఒకరికొకరు పోటాపోటీగా ముగ్గులు వేశారు. బహుమతులకు ముగ్గులను ఎంపిక చేయడం న్యాయనిర్ణేతలకు సవాల్‌గా మారింది. మూడు జిల్లాల్లోనూ మూడేసి చొప్పున బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి విజేతకు రూ.6 వేలు ..ద్వితీయ బహుమతి విజేతకు రూ.4 వేలు..తృతీయ బహుమతి విజేతకు రూ.3 వేలు అందజేశారు. ఇవి కాక పెద్ద ఎత్తున కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీలకు హాజరైన ప్రతి ఒక్కరికి బహుమతి ఇచ్చి పంపారు.. పోటీలకు హాజరైన పలువురు మహిళలు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీల కోసం ఏడాదంతా ఎదురుచూస్తూనే ఉంటామని చెప్పడం గమనార్హం. కొందరైతే తెలుగు సంప్రదాయాన్ని గుర్తు చేస్తున్న 'ఆంధ్ర జ్యోతి'కి ధన్యవాదాలు తెలిపారు. ఎందుకంటే నాడు పట్టణమైనా..పల్లె అయినా ధనుర్మాసం ఆరంభం నుంచి ముగిసే వరకూ ముగ్గులతో వీధులన్నీ కళకళలాడేవి.. రోగాలను దూరం చేసేవి..నేడు రోగాలు పెరి గాయి..ముగ్గులు తగ్గాయి. కాలంతో పాటు జీవన విధానంలోనూ మార్పులు వచ్చాయి.. ఒకనాడు టీవీ.. నేడు సెల్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారు..ఈ విధానం మారాలి.. మళ్లీ ఆ పాత సంప్రదాయాన్ని తట్టి లేపడానికే 'ఆంధ్రజ్యోతి' ప్రతి ఏడాది ముగ్గుల పోటీలు నిర్వహిస్తోంది.

చుక్కల ముగ్గు.. లెక్క తేల్చగలరా?

చుక్కలు రంగులద్దుకున్నాయి.. పువ్వు లుగా మారాయి.. అక్షరాలయ్యాయి.. ఒక రూపాన్ని సంతరించుకున్నాయి.. అందాన్ని ఆనందాన్ని పంచాయి.. అదె లాగంటే.. అదే మరి ముగ్గు ప్రత్యేకత.. 21 చుక్కలు అటూ ఇటూ.. 21 అడ్డం.. 21 నిలువు అనమాట.. చూసే వారికి ఏం అర్థం కాదు.. ఒక అరగంట ఆగి చూశామా.. ఆ చుక్కలన్నీ రకరకాల రూపాలను సంత రించుకుంటాయి. చుక్కలు ఎక్కడున్నాయో కనిపెట్టడం కష్టమే.. ఇదీ ముగ్గు ప్రత్యేకత.. నేటి కంప్యూటర్‌తరం కూడా విడదీసి చెప్ప లేని లెక్క ఇది.. ఒక్క మహిళలకు మాత్రమే అర్థమయ్యే లెక్క.. తెలుగింట సంప్రదాయం ముగ్గు..



ముగ్గు వేస్తున్న తూర్పు కలెక్టర్ ప్రశాంతి



చుక్క..చుక్క కలిపి

ఈ చుక్కలెన్నో చెప్పగలరా.. ఎక్కడున్నాయో విప్పగలరా.. చెప్పడం కష్టమే కదా.. కాకినాడకు చెందిన పోతుల సునీత ఇలా చుక్కలు ముగ్గు వేసి.. మొదటి బహుమతి సాధించారు.



రంగుల హరివిల్లు

ముగ్గు చూస్తుంటే చూస్తూనే ఉండి పోవాలనిపిస్తుంది కదూ.. అదే మరి ముగ్గు ప్రత్యేకత. రావులపాలెంనకు చెందిన వి.సావిత్రి అమలాపురంలో నిర్వహించిన పోటీల్లో మొదటి బహుమతి సాధించారు.



పండుగొచ్చింది!

ముగ్గు చూస్తుంటే సంక్రాంతి పండుగ వచ్చేసినట్టుంది కదూ.. అదే ఈ ముగ్గు ప్రత్యేకత.. రావుపాలెంనకు చెందిన గిరి అమ్మాజీ రాజమండ్రిలో నిర్వహించిన పోటీల్లో ముగ్గు వేసి ప్రథమ బహుమతి సాధించారు.

నేటి నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల తనిఖీ

మొత్తం 493 మంది అర్హతను తేల్చే ప్రక్రియ

అమలాపురం టౌన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 6 నుంచి 25వ తేదీ వరకు జిల్లాలోని ఎన్టీఆర్ భరోసా ఆరోగ్య పెన్షన్ల తనిఖీ ప్రక్రియ కొనసాగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. నెలకు రూ.15వేలు పెన్షన్ పొందుతూ మంచానికి, వీల్‌చైర్లకు పరిమితమైన 373 మంది పెన్షన్‌దారులు మస్క్యులర్ డిస్ట్రోఫి, యాక్సిడెంట్ ప్రభావిత వ్యక్తులకు జిల్లాలో 120 మందికి పెన్షన్లు అందుతున్నాయన్నారు. మొత్తంగా 493 మంది అర్హతను ఈ ప్రక్రియలో వైద్య నిపుణులతో కూడిన బృందాలు పరిశీలించనున్నాయని చెప్పారు. ఇందుకోసం మూడు వైద్య బృందాలను నియమించినట్లు చెప్పారు. నిర్దేశిత తేదీల్లో పెన్షన్ లబ్ధిదారుని ఇంటిని సందర్శించి లబ్ధిదారుని భౌతిక ఆరోగ్య స్థితిని వైద్య పరంగా పరిశీలిస్తారు. ప్రతీ వైద్య బృందంలో ఒక ఆర్థోపెడిక్ సర్జన్, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులు, సంబంధిత పీహెచ్‌సీ వైద్యాధికారి, డిజిటల్ అసిస్టెంట్ ఉంటారు. సంబంధిత లబ్ధిదారులకు ముందుగానే సమాచారం తెలియచేస్తారు. లబ్ధిదారులు తప్పనిసరిగా ఆ సమయంలో ఇంటి వద్ద అందుబాటులో ఉండాలని కోరారు. అందుబాటులో లేని లబ్ధిదారుల పెన్షన్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేయనున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. పెన్షన్ వెరిఫికేషన్ బృందాలకు డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కార్తీక్‌రెడ్డి, డీఎంహెచ్‌వో దొరబాబు, జీఎస్‌డబ్ల్యుఎస్ నోడల్ అధికారి త్రినాథరావుల ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు.



మండపేట మండలంలో జరుగుతున్న రహదారి మరమ్మతులు

రోడ్లకు మహర్దశ

జిల్లాలో పలు రోడ్లకు మరమ్మతులు

రూ.40 కోట్లతో 159 రోడ్లకు మరమ్మతులు

10వ తేదీకల్లా పూర్తయ్యేలా డెడ్‌లైన్

వైసీపీ ప్రభుత్వంలో పూర్తి నిర్లక్ష్యానికి గురైన రహదారులకు కూటమి ప్రభుత్వంలో మహర్దశ పట్టింది. గుంతలుగా మారిన రహదారులు మారుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో రహదారులు చెరువులను తలపించేలా తయారయ్యాయి. వైసీపీ నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా మారాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ముందుగా రోడ్ల మరమ్మతులకు శ్రీకారం చుట్టింది.

మండపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి):జనవరి పదినాటి కల్లా జిల్లాలో ఏ నియోజకవర్గంలోనైనా రోడ్డు బాగోలేదనే మాట వినపడకూడదని, ఒకవేళ ఎక్కడైనా పత్రికల్లో కానీ సామాజిక మాధ్యమాల్లో కానీ వచ్చినట్టయితే స్థానిక శాసనసభ్యులే దానికి బాధ్యులని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన హెచ్చరికలతో రహదారుల మరమ్మతుల పనులు ఊపందుకున్నాయి. గుంతల రహిత రహదారుల నిర్మాణమే లక్ష్యంగా సాగుతున్న మరమ్మతులతో రహదారులపై వాహనదారులు రయ్‌రయ్‌మంటూ ప్రయాణాన్ని సాఫీగా సాగిస్తున్నారు. నవంబరు 2న జిల్లాలో 600 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్లకు మరమ్మతులు ప్రారంభించారు. రూ.40 కోట్ల వ్యయంతో 159 రోడ్లకు మరమ్మతులు జరుగుతున్నాయి. జిల్లాలో సుమారు 25 వేల నుంచి 30 వేల మధ్య గుంతలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అడుగు పొడవు, అడుగు వెడల్పు, రెండు అంగులాల లోతు, పది అంగుళాల లోతు వరకు అధిక సంఖ్యలో గోతులు ఉన్నాయి. ఇప్పటికే జిల్లాలో మూడు వంతుల మేర మరమ్మతులు పూర్తయ్యాయని ఈ నెల 10 నాటికల్లా జిల్లాలో ఆర్‌అండ్‌బీ రహదారుల గుంతలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు పూర్తి చేసి గుంతలు లేని రోడ్లను చేస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు చెప్పారు.

ఐదు బస్సులు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపోకు కొత్తగా వచ్చిన ఐదు బస్సులను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. వీటిలో మూడు ఎక్స్‌ప్రెస్ బస్సులు కాగా రెండు సూపర్ లగ్జరీ బస్సులు ఉన్నాయి. కార్యక్రమంలో డిపో మేనేజర్ సీహెచ్‌ఎస్ఎన్ మూర్తి, విజిలెన్స్ అధికారి నాగమునీంద్ర, గ్యారేజ్ ఇన్‌చార్జి జీఆర్ఎల్ దేవి, ట్రాఫిక్ ఇన్‌చార్జి ప్రతిమాకుమారి, ఓపీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎన్.వరహాలబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, తిక్కిరెడ్డి నేతాజీ, వలవల శివరావు, బోనం సత్తిబాబు, జంగా అబ్బాయి వెంకన్న పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో యథావిధిగా గ్రీవెన్స్

అమలాపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాస్థాయితో పాటు డివిజన్, మండలస్థాయిల్లో గ్రీవెన్స్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో జాప్యం

కూటమి ప్రభుత్వం వచ్చి 7 నెలలు గడిచినా ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయి

ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్లను పరిష్కరించాలి

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్



ఎస్టీయూ జిల్లాశాఖ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్



సమావేశానికి హాజరైన సంఘ సభ్యులు

అమలాపురం టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నప్పటికీ 11 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో మీనమేషాలు లెక్కిస్తుందని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్ అన్నారు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదని విమర్శించారు. అమలాపురం అంబేడ్కర్ భవన్‌లో ఎస్టీయూ 78వ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం ఆదివారం జిల్లా శాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించడంతో పాటు పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.25 వేల కోట్ల బకాయిలు మంజూరు చేయాలన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి పాఠశాల సహాయకులను జూనియర్ అధ్యాపకులుగా పదోన్నతులు కల్పించాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు జీపీఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లం రాజు మాట్లాడుతూ ఈహెచ్‌ఎస్ కార్డులు పూర్తిస్థాయిలో అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు ఎంటీఎస్‌ను అమలు చేయాలని, 1998, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచి, దశలవారీగా రెగ్యులర్ చేయాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పదవీ విరమణతో ఉన్నత పాఠశాలల్లో ఖాళీ అయిన సబ్జెక్టు టీచర్ల కొరతను నివారించేందుకు విద్యా వలంటీర్లను నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గించాలని ఎంఈవో-1, 2లకు సమానంగా అధికారాలు ఇవ్వాలన్నారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు పెన్షన్ సౌలభ్యం జాప్యం లేకుండా మంజూరు చేయాలన్నారు. పాఠశాల స్థాయిలో వివిధ రకాల యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వార్షిక మహాసభకు మరో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయుల మద్దతుతోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ముందుంటుందని, 117 జీవో రద్దుకు సంబంధించి విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పూర్తిస్థాయిలో కసరత్తు చేస్తున్నారన్నారు. మార్చి నెలాఖరు నాటికి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేసే దిశగా నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. పెండింగ్ బకాయిల బిల్లులు, ప్రతీనెలా 1వ తేదీ జీతాలు చెల్లించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఉపాధ్యాయులను విద్యా బోధనకే పరిమితం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థిగా ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నా పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్ మాట్లాడారు. కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రధాన కార్యదర్శి నివేదిక, ఆర్థిక కార్యదర్శి నివేదిక, అభయ్, సీపీఎస్ కన్వీనర్, ఉపాధ్యాయవాణి, మహిళా కన్వీనర్ నివేదికలను సమావేశంలో ప్రవేశపెట్టి ఆమోదించారు. జిల్లా ఆర్థిక కార్యదర్శి నేరేడుమిల్లి సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చొప్పల రాంబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి కొప్పుల సత్తిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల శాఖల ప్రతినిధులు హాజరయ్యారు.



కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలు ప్రారంభం 7లో

తొలిరోజు 20 వేల మంది ఉపాధ్యాయులు హాజరు

నేటి నుంచి యానాంలో ప్రజా ఉత్సవాలు



ఏర్పాట్లు పూర్తి 7లో

రెపరెపలాడిన యూటీఎఫ్ జెండా



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, ఆర్‌జేడీ నాగమణి

- కాకినాడలో ఘనంగా ప్రారంభమైన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు
- తొలిరోజు 20వేల మంది ఉపాధ్యాయులు హాజరు
- వైసీపీ హయాంలో పాఠశాలలు నాశనం
- ప్రభుత్వ బడులను కాపాడుకునేందుకు ప్రాణాలైన అర్పిస్తాం : సభలో వక్తలు

కాకినాడలో యూటీఎఫ్ ఎర్ర జెండా రెపరెపలాడింది. పీఆర్ డిగ్రీ కళాశాలలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. యూటీఎఫ్ వర్ధిల్లాలి.. విప్లవం వర్ధిల్లాలి అంటూ యూటీఎఫ్ శ్రేణులు చేసిన నినాదాలు మిన్నంటాయి. ప్రాణాలైనా అర్పిస్తాం - ప్రభుత్వ బడులను కాపాడుకుంటామని నినాదాలు చేశారు.

కలెక్టరేట్ (కాకినాడ), జనవరి 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలతో విద్యావ్యవస్థ ధ్వంసమైందని ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు ధ్వంసమయ్యాయని, అయినప్పటికీ వాటిని కాపాడుకోవడానికి ఎన్నో ఉద్యమాలు చేశామని యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలో వక్తలు పేర్కొన్నారు. కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం యూటీఎఫ్ 17వ స్వర్ణోత్సవ విద్యా వైజ్ఞానిక మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సభకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ బడులను కాపాడుకునేందుకు ఎన్ని ఉద్యమాలైనా చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం 117 జీవో ద్వారా పాఠశాల విద్యకు ఉరిశిక్ష విధించిందన్నారు. 3,4,5 తరగతుల విద్యార్థులను హైస్కూళ్లలో కలిపి విద్యా వ్యవస్థను నాశనం చేసిందని విమర్శించారు. వైసీపీ నిర్ణయాల వల్ల రాష్ట్రంలో విద్యారంగం సర్వ నాశనమైందని, సీపీఎస్ రద్దు చేస్తామని అధికారంలోకి వచ్చి ఉపాధ్యాయులను తీవ్రంగా మోసం చేసిందన్నారు. నేటి పాలకుల ఉదాసీన వైఖరి వల్ల రాజ్యాంగ లక్షణాలు మరుగునపడ్డాయని, వీటిని పరిరక్షించాల్సిన బాధ్యత యూటీఎఫ్ ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. ప్రభుత్వ విధానాలతో ప్రభుత్వ విద్యారంగ విద్య నానాటికీ కుంటుపడుతుందన్నారు. ఇప్పటికే దేశంలో సగంవరకు విద్యారంగం ప్రైవేటీకరణ జరిగిందని దీని వల్ల పేద విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 75ఏళ్ల రిపబ్లిక్ డే ఉత్సవాలు జరుపుకుంటున్న మనం ప్రభుత్వ రంగంలో ఉన్న బడులను సంరక్షించుకోవాలన్నారు. దేశంలో వెయ్యి విశ్వ విద్యాలయాలు ఉంటే దానిలో సగం వరకు ప్రైవేటు రంగంలోనే ఉన్నాయన్నారు. 1984లో జాతీయస్థాయిలో ప్రవేశపెట్టిన విద్యాపాలసీ వల్లే విద్యలో ప్రైవేటీకరణకు బీజం పడిందని తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ప్రైవేటీకరణను ప్రోత్సహించాయని ఆయన పేర్కొన్నారు.



ఉద్యమ గీతాలాపన చేస్తున్న యూటీఎఫ్ బృందం

పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తి

ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తును నిర్దేశిస్తారని, రాష్ట్రంలో ప్రభుత్వ రంగ పాఠశాలలను పరిరక్షించుకోవాలన్నారు. గత ప్రభుత్వం తీరుతో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమయ్యాయన్నారు. ఉభయ గోదావరిజిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి మాట్లాడుతూ యూటీఎఫ్ ఏర్పాటై యాభైఏళ్లు పూర్తి కావడంతో సర్ణోత్సవాలు నిర్వహించుకుంటున్నామన్నారు. పోరాటాల ద్వారా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించిందన్నారు. జాతీయ విద్యా విధానం 2020ను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, ఇది విద్యారంగంలో మతతత్వాన్ని పెంచేదిగా ఉందన్నారు. అఖిలభారత ఉపాధ్యాయ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి సీఎన్ భారతి మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. గత ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని విమర్శించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ట్యాబ్‌లు, బైజూస్ వంటి విద్యావిధానాలు ప్రవేశపెట్టి ఉపాధ్యాయులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని దీంతో రాష్ట్రంలో లక్షన్నరమంది విద్యార్థులు విద్యకు దూరమయ్యారన్నారు. విద్యావ్యవస్థను నాశనం చేసే అన్ని నిర్ణయాలు వైసీపీ ప్రభుత్వం తీసుకుందని విమర్శించారు. సుమారు రూ.31వేలకోట్ల బకాయిలు ఉపాధ్యాయులకు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిందన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యూటీఎఫ్ యాభైఏళ్ల ఉద్యమాలతో ప్రభుత్వ బడులను కాపాడుకుందన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల విద్యావ్యవస్థ కోలుకోని దెబ్బతగిలిందన్నారు. ఎన్నో ఉద్యమాలు చేసి విద్యారంగాన్ని కాపాడుకున్నామన్నారు. తొలుత జాతీయ జెండాను, తర్వాత యూటీఎఫ్ జెండాను, ఎస్టీఎఫ్ఐ జెండాలను సీనియర్ నాయకులు కె.సత్తిరాజు, టీవీ రాఘవులు, జి.చిట్టిబాబులు ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రాసిన నాలుగు పుస్తకాలను సభలో ఆవిష్కరించారు. యూటీఎఫ్ అమరజీవుల స్థూపాన్ని అఖిలభారత ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి సీఎన్ భారతి ఆవిష్కరించారు. తదనంతరం 16 మహా సభల జాతాల జెండాలను ఆవిష్కరించారు.

కిక్కిరిసిన పీఆర్ ప్రాంగణం

ఈ మహాసభలకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి యూటీఎఫ్ ఉపాధ్యాయులు 20వేల మంది హాజరయ్యారు. దీంతో పీఆర్ కళాశాల ప్రాంగణం కిక్కిరిసింది. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, తెలంగాణ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమాదేవి, కాకినాడ ఆర్జేడీ నాగమణి, మాజీ అధ్యక్షుడు జోజయ్య, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, చక్రవర్తి, ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, కుసుమకుమారి, కుమార్‌రాజా, హనుమంతురావు, నాగమ ల్లేశ్వరరావు, అన్నారాం, మనోహర్, జ్యోతి బసుచఅరుణకుమారి ఉన్నారు.

అప్పుడు రజతోత్సవాలు.. ఇప్పుడు స్వర్ణోత్సవ సంబరాలు

యూటీఎఫ్ 25ఏళ్ల రజతోత్సవాలు, 50 ఏళ్ల స్వర్ణోత్సవ మహాసభలకు కాకినాడలోని పీఆర్ కళాశాల వేదికగా నిలిచింది. 25ఏళ్ల క్రితం ఇదే పీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో యూటీఎఫ్ రజతోత్సవాల సభలు ఘనంగా జరిగాయి. మళ్లీ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణత్సవాలు సభలు ఇక్కడే జరగడం విశేషం.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో భాగంగా రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. రౌతులపూడి మండలానికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయునులు వివిధ గీతాలకు నృత్యాలు చేశారు.

పసందైన వంటకాలతో విందు

యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలకు రెండు రాష్ట్రాల నుంచి 20వేల మంది ఉపాధ్యాయులు విచ్చేయగా అందరికీ నోరూరించి పసందైన వంటకాలతో విందు అందించారు. ఎమ్మెల్సీలు గోపిమూర్తి, లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు భోజనాలు వడ్డించారు.

పూలప్రేమికులకు ఆహ్వానం

» నేటి నుంచి యానాంలో ఫలపుష్ప ప్రదర్శన, ప్రజా ఉత్సవాలు » ప్రత్యేక ఆకర్షణగా 'పుష్ప 2' ఎడ్లబండి, ఎర్రచందనం

యానాం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో పూల ప్రేమికులను ఆహ్లాద పరిచేందుకు యానాం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 23వ ఫలపుష్ప ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో గత 22 ఏళ్లుగా ఈ ఉత్సవాలను జనవరి 6 నుంచి 8 వరకూ ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అధ్యక్షతన జరగనున్న ఈ ప్రదర్శనకు పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి, స్పీకర్ సేల్వం, మత్స్యశాఖ మంత్రి లక్ష్మీనారాయణ, వ్యవసాయశాఖమంత్రి జైకుమార్, వివిధ శాఖాధికారులు హాజరుకానున్నారు.



సర్వాంగ సుందరంగా ముఖద్వారం



వివిధ రకాల జాతుల ఫలపుష్పాలు



పుష్ప2 సినిమాలో ఉపయోగించిన ఎడ్లబండి, ఎర్రచందనం



వివిధ రకాల జాతుల పుష్పాలతో...

ముఖ్యంగా ఈ ఫల పుష్పప్రదర్శన యానాం, పరిసరప్రాంత ప్రజలకు మంచి ఆహ్లాదకర వాతావరణాన్ని చేకూరుస్తుంది. వీటిలో తూర్పు గోదావరి జిల్లాలోని కడియం, రాజమండ్రి, బెంగుళూరు, తదితర ప్రాంతాల నుండే కాకుండా యానాం వ్యవసాయశాఖ, మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పెంచుతున్న వివిధ రకాల జాతుల ఫలపుష్పాలను ప్రదర్శనకు ఉంచుతారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు స్థానిక వ్యవసాయ శాఖ డీడీ శివసుబ్రహ్మణ్యన్ పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే వివిధ నర్సరీల నుంచి అనేక రకాల పూల మొక్కలు యానాం చేరుకున్నాయి. సోమవారం సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభంకానుంది. 3 రోజుల పాటు జరిగే ప్రదర్శనలో ప్రజలనందరిని ఆకర్షించే విధంగా వివిధ రకాల స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ రాజశేఖరన్ ఆధ్వర్యంలో సీఐ షణ్ముగం గట్టి బందోబస్తు సిద్ధం చేశారు. ఈ సంవత్సరం పుష్ప-2 చిత్రంలో హీరో అల్లు అర్జున్ ఉపయోగించిన ఎడ్లబండి, ఎర్రచందనం ప్రత్యేక అర్షణగా ఈ ప్రదర్శనలో నిలవనున్నాయి. ఇప్పటికే డైరెక్టర్ సుకుమార్‌తో మాట్లాడిన ఢిల్లీ ప్రతినిధి మల్లాడి వాటిని ఇక్కడకు తీసుకురావడం జరిగింది. యానాం చేరుకున్న వ్యవసాయశాఖ మంత్రి జైకుమార్‌కు ఢిల్లీ ప్రతినిధి మల్లాడి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రితో కలిసి ఫలపుష్ప ప్రదర్శన కోసం జరుగుతున్న ఏర్పాట్ల పరిశీలించారు. కార్యక్రమంలో యానాం పరిపాలనాధికారి మునిస్వామి, డిప్యూటీ డైరెక్టర్ జె.శివశుబ్రమణియన్, ఎస్పీ రాజశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఆవుల అందాల పోటీలు





గిరి ఆవుల అందాల పోటీల్లో ప్రథమస్థానం పొందిన ఆవు, ఒంగోలు ఆవుల అందాల పోటీల్లో ప్రథమస్థానం పొందిన ఆవు



ఒంగోలు ఆవుల పాల పోటీల్లో ప్రథమస్థానం పొందిన ఆవు

మలికిపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కేశనపల్లిలో రాష్ట్రస్థాయి ఒంగోలు, పుంగనూరు, గిరి ఆవుల అందాల పోటీలు, ఒంగోలు పాల పోటీలు అలరించాయి. రాష్ట్ర పశుసంవర్ధకశాఖ, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సహకారంతో అడబాల లక్ష్మీనారాయణ (నాని) నిర్వహించిన ఈ పోటీల్లో 180 వివిధ రకాలకు చెందిన ఒంగోలు, పుంగనూరు, గిరి జాతికి చెందిన ఆవులు, గిత్తలు పాల్గొన్నాయి. పాల పోటీల్లో మండపేటకు చెందిన మల్లిపూడి వెంకట్రావకు చెందిన ఒంగోలు ఆవు 16.246 కిలోల పాల దిగుబడితో ప్రథమస్థానం పొందగా అదే రైతుకు చెందిన మరో ఆవు 14.206 కిలోల పాల దిగుబడితో ద్వితీయ బహుమతి పొందింది. ఏలూరుకు రామశింగవరం సర్పంచ్ అడపా శ్రీనివాసరావుకు చెందిన ఒంగోలు ఆవు 14.766 కిలోల దిగుబడితో తృతీయ స్థానం పొందింది. ఒంగోలు ఆవుల అందాల పోటీల్లో ఏలూరు జిల్లా రామశింగవరానికి చెందిన అడపా శ్రీనివాసరావుకు చెందిన ఆవు ప్రథమ స్థానం, ముత్యాల విజయకిరణ్‌కు చెందిన ఆవు ద్వితీయ స్థానం, ముప్పాళ్ల నాగేశ్వరరావుకు చెందిన తృతీయ స్థానంలో నిలిచి బహుమతులు సాధించాయి.

పుంగనూరు ఆవుల అందాల పోటీల్లో భీమవరానికి చెందిన బర్రెడ్డి మణికంఠసతీష్‌కు చెందిన పుంగనూరు ఆవు ప్రథమస్థానం పొందగా కోనసీమ జిల్లా మాచవరానికి చెందిన అడబాల ప్రేమ్‌కుమార్ ఆవు ద్వితీయస్థానం, మండపేటకు చెందిన వి.చక్రవర్తికి చెందిన ఆవు తృతీయ స్థానంలో నిలిచాయి. గిరి ఆవుల అందాల పోటీల్లో భీమవరానికి చెందిన బర్రెడ్డి మణికంఠసతీష్‌కు చెందిన ఆవు ప్రథమస్థానం, లక్కవరానికి చెందిన రుద్రరాజు బుజ్జిరాజు ఆవు ద్వితీయ స్థానం, లక్కవరానికి చెందిన అల్లూరి పృథ్విరాజ్‌కు చెందిన ఆవు తృతీయ స్థానాలు సాధించాయి. పుంగనూరు గిత్తల అందాల పోటీల్లో మాచవరానికి చెందిన అడబాల ప్రేమకుమార్‌కు చెందిన గిత్తకు ప్రథమస్థానం, గుమ్మిలేరుకు చెందిన రెడ్డి వీరవెంకటసత్యనారాయణ గిత్తకు ద్వితీయస్థానం, పడమటిపాలేనికి చెందిన గుండాబత్తుల మధుకు చెందిన గిత్తకు తృతీయస్థానం లభించాయి. పోటీల్లో పాల్గొన్న వివిధ రకాల ఆవులను పది విభాగాలుగా విభజించి అన్ని విభాగాల్లోను బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అడబాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సభలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాదరావు మాట్లాడుతూ పాడి పంటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పోటీలను ఏర్పాటుచేసిన నానినీ అభినందించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ యెనుముల నాగు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, నర్సాపురం ఎమ్మెల్యే కొత్తపల్లి జానకీరామ్, మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా, ఎన్డీఏకు నాయకులు పాల్గొన్నారు. విజేతలకు రూ.6లక్షల 50వేలు విలువైన నగదు బహుమతులను అందించారు.

రోడ్డు ప్రమాదంలో సబ్ ఎడిటర్‌కు తీవ్రగాయాలు

రాజమహేంద్రవరంసిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక ప్రముఖ దిన పత్రికలో సబ్ ఎడిటర్‌గా పనిచేస్తున్న జె.ప్రభాకరావు తీవ్రంగా గాయపడ్డారు. ప్రకాష్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం లాలాచెరువుకు చెందిన ప్రభాకర్‌రావు ఒక ప్రముఖ దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం రాజమహేంద్రవరం ఎస్‌వీజీ మార్కెట్‌కు బైక్‌పై వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గంమధ్యలో తిలక్‌రోడ్డు వద్దకు వచ్చేసరికి ఒక స్కూటీపై యువకుడు అతివేగంగా వచ్చి ఢీకొన్నాడు. ఈ సంఘటనలో ప్రభాకర్‌రావు తలకు తీవ్రగాయమైంది. వెంటనే స్థానికులు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తలకు తీవ్రగాయం కావడంతో ప్రభాకరరావు కోమలో ఉన్నారు. ఆసుపత్రి వైద్యులు వైద్యసేవలు అందిస్తున్నారు. ఈమేరకు ప్రకాష్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాదంలో మరణించిన సూర్యనారాయణ

పిఠాపురం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాతబస్టాండు సెంటర్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మరణించాడు. పట్టణంలోని కత్తులగూడెంకు చెందిన బాదం సూర్యనారాయణ(63) కొన్నేళ్లుగా పాతబస్టాండు వద్ద గల హెచ్‌పీ బంకులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం బంకు నుంచి ఇంటికి వెళ్లేందుకు సైకిల్‌పై బయటకు రాగా తుని నుంచి కాకినాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో సూర్యనారాయణ అక్కడిక్కడే మరణించాడు. అతడికి భార్య, కుమారుడు లింగమూర్తి ఉన్నారు. మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులతో గౌరవంగా మెలగాలి

ప్రధానాలయాల సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్‌లో దేవదాయ కమిషనర్

అన్నవరం జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సుదూర ప్రాంతాల నుంచి ఆలయాలకు విచ్చేసే భక్తుల పట్ల సిబ్బంది గౌరవంగా మెలగడంతో పాటుగా వారికి కావలసిన సమాచారాన్ని అందించాలని దేవదాయ కమిషనర్ సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం ప్రధానాలయాల సిబ్బందితో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడగా అన్నవరం ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ప్రతి భక్తుడు నుంచి ఫోన్ల ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకోవడం జరుగుతుందని దీనిని సీఎంవో కార్యాలయం మోనటరింగ్ చేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తుందన్నారు. దర్శనం నుంచి సత్రంగదులు, అన్నదానంతో పాటుగా ప్రతీ విభాగం నుంచి భక్తుల నుంచి వచ్చే ఫిర్యాదుల ఆధారంగా ఆయా సిబ్బందిపై చర్యలు ఉంటాయన్నారు. ప్రతి చోట ఫిర్యాదుల బుక్‌లు, ఫిర్యాదు చేయాల్సిన ఫోన్ నెంబర్లు ఉంచాలని సీఎంవో కార్యాలయం నుంచి సదరు భక్తుడికి ఫోన్‌కాల్ వెళ్తుందని ప్రతీ సమస్యను క్షుణ్ణంగా అధ్యయనం చేసి తదనుగుణంగా చర్యలుంటాయని తెలిపారు. ప్రసాదం నాణ్యత పెంపు, అన్నదానంలో రుచికరమైన భోజనం అందించడంలో నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించకూడదని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో సహాయకమిషనర్ సీహెచ్. రామ్మోహనరావు, ఏఈవోలు కృష్ణారావు, ఎల్.శ్రీనివాస్, పాలంకి జగ్గారావు, కొండలరావు, ఇంజనీరింగ్ అధికారులు, సూపరెంటెండెంట్‌లు తదితరులున్నారు.

స్వామి,అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలు

అన్నవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకుని సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లకు, క్షేత్రపాలకులు సీతారాములు, వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లకు విశాఖపట్నానికి చెందిన శ్రీరామ్‌తేజ్ దంపతులు నూతన పట్టువస్త్రాలను ఆలయ ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేశారు. ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చకుడు ఇంద్రగంటి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



అన్నవరం ఆలయంలో పట్టు వస్త్రాలను ఈవోకు అందజేస్తున్న దాత







మోగిన శంఖం

కదంతొక్కిన హైందవ సోదరులు.. కాషాయమయమైన కేసరపల్లి

భారతీయ సంస్కృతి, సంప్రదాయం, సనాతన ధర్మం, ఆధ్యాత్మికతను భవిష్యత్ తరాలకు చాటిచెప్పే ఉద్దేశంతో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలోని గన్నవరం మండలం కేసరపల్లిలో ఆదివారం హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హిందువులు పెద్ద ఎత్తున తరలి రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దేశవ్యాప్తంగా కీర్తి గడించిన ఎందరో హైందవ నేతలు తమ ప్రసంగాల్లో హిందూధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి హైందవ సోదరులు ర్యాలీలుగా తరలివచ్చారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

సభా ప్రాంగణానికి వెళ్తున్న హిందువులు







సభలో ప్రసంగిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి, గోవింద్ దేవ్ గిరిజి మహరాజ్, స్వామి కమలానంద, స్వామి వరదానంద

హిందూ సోదరులతో కిక్కిరిసిన కేసరపల్లిలోని సభా ప్రాంగణం



రక్తదాన శిబిరం

అమలాపురంటౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంత్యుత్సవాల సందర్భంగా అమలాపురం సహస్ర బ్లడ్ బ్యాంకులో లైఫ్ ఈజ్‌బ్యూటీఫుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ వెన్నా శ్రీహరిరాయలు, డాక్టర్ కొల్లు శ్రీనుబాబు, ఎండీ శ్రీహరి హాజరయ్యారు. పలువురు రక్తదానం చేశారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, జనవరి5(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు హైదరాబాదుకు చెందిన బోదరాజు సూర్యనారాయణమూర్తి దంపతులు ఆదివారం రూ.10,116 విరాళంగా ఇచ్చారు. అర్చకుడు యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో దాత దంపతులకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామి చిత్రపటం, ప్రసాదంతో సత్కరించారు.

ఉపాధ్యాయులకు ఐఆర్, డీఏ ప్రకటించాలి

● ఏపీ టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు

ముమ్మిడివరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఐఆర్, డీఏలను వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు డిమాండ్ చేశారు. ముమ్మిడివరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో ఎస్ఎన్ మునేశ్వరరావు అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా ఎస్ఎన్ మునేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఉందుర్తి వీరవెంకట్రావు, రాష్ట్ర కౌన్సిలర్‌గా జీవీవీ సత్యనారాయణలతో పాటు మరి కొంతమంది కార్యవర్గ సభ్యులతో ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి పీఆర్సీని వెంటనే ప్రకటించాలని సమావేశం డిమాండ్ చేసింది. సమావేశంలో నాగాబత్తుల నరసింహమూర్తి, వై.వెంకట్రాజు, ఎ.ఉదయబ్రహ్మం, ఈ.అప్పయ్యశర్మ, కేవీవీ సత్యనారాయణ, మోర్త రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సత్కరిస్తున్న దృశ్యం

హైందవ శంఖారావ సభకు తరలిన హిందువులు



అమలాపురం: హైందవ శంఖారావ సభకు హిందూ సంప్రదాయ వేషధారణలతో బయలుదేరిన భక్తులు

అమలాపురం టౌన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆదివారం జరిగిన హైందవ శంఖారావం సభకు అమలాపురం పట్టణ, పరిసర గ్రామాల నుంచి వందలాది మంది ప్రత్యేక బస్సుల్లో బయలుదేరారు. తెల్లవారుజామున 5 గంటల సమయానికే మహిళలతో పాటు వృద్ధులు సైతం అధిక సంఖ్యలో తరలివచ్చి సభకు బయలుదేరారు. పట్టణానికి చెందిన పలువురు హిందూ సంప్రదాయ వేషధారణలతో పాటు ఝాన్సీలక్ష్మీబాయి, భరతమాత వేషధారణలతో తరలివెళ్లారు. విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు శిరంగు నాయుడు, ఊటుకూరి సాంబయ్య, గొవ్వాల రాజేష్, యెండూరి సీత, పెండ్యాల సీతారామ్, భమిడిపాటి కృష్ణమూర్తి, కుడుపూడి గోపాలకృష్ణతో పాటు జిల్లాకు చెందిన బీజేపీ నాయకులు యాళ్ల దొరబాబు, మోకా వెంకట సుబ్బారావు తదితరులు శంఖారావం సభకు వెళ్లారు. అమలాపురం మండలం బండారులంక, కామనగరువు తదితర గ్రామాల నుంచి ప్రత్యేక బస్సులను శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, ఉప్పుగంటి భాస్కరరావు ఆధ్వర్యంలో ప్రారంభించారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): విజయవాడలో నిర్వహించిన హైంద శంఖారావానికి మండలం నుంచి హిందువులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. అంబాజీపేట, పుల్లేటికుర్రు, ముక్కామల, చిరతపూడి, నందంపూడి, వాకలగరువు, గంగలకుర్రు, అగ్రహారం తదితర గ్రామాల నుంచి బస్సులు, కార్లపై భారీగా తరలివెళ్లారు. జై శ్రీరామ్ నినాదాలు, జెండాలతో తరలివెళ్లారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కేసరపల్లిలో ఆదివారం జరిగిన హైందవ శంఖారావం బహిరంగ సభకు రాజోలు మండలం నుంచి అధిక సంఖ్యలో హిందువులు పలు బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. జైశ్రీరామ్.. జైజై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కుమార్, శ్రీనివాస్, సురేష్, సత్తిబాబు, రామకృష్ణగుప్త, చంద్రశేఖర్, శ్రీరామమూర్తి, మల్లికార్జునరావు, విష్ణువర్ధన్, సాయిమణికంఠ తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆదివారం జరిగిన హైందవ శంఖారావం కార్యక్రమానికి మండలం నుంచి అధిక సంఖ్యలో హిందువులు తరలివెళ్లారు. గ్రామగ్రామాల నుంచి బస్సు ఏర్పాటు చేసుకుని హిందూ దేవాలయాల్లో పూజలుచేసి విజయవాడ వెళ్లారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): విజయవాడ-గన్నవరం పరిధిలోని కేసరపల్లిలో ఆదివారం జరిగిన హైందవ శంఖారావానికి అల్లవరం మండలం నుంచి అధికసంఖ్యలో బీజేపీ, వీహెచ్‌పీ కార్యకర్తలు తరలివెళ్లారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ఆధ్వర్యంలో అల్లవరం మండలం నుంచి 12బస్సులు, కార్లలో శంఖారావానికి తరలివెళ్లారు. కట్టా నారాయణమూర్తి, అల్లు సత్తిబాబు, సుంకర సాయి, రేకాడి వర్మ, గూడాల పుల్లయ్యశెట్టి శంఖారావానికి తరలివెళ్లారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం మండలంలోని పలు గ్రామాల నుంచి ఆదివారం హైందవ శంఖారావానికి అధిక సంఖ్యలో జనం తరలివెళ్లారు. మార్గమధ్యంలో దేవాలయాల వద్ద పూజలు నిర్వహించారు. ఉప్పలగుప్తంలో అంజనేయస్వామి అలయం వద్ద నిర్వాహకుడు మోటూరి రవిశంకర్‌కుమార్ శంఖారావ బస్సులకు పూజలు చేసి యాత్ర ప్రారంభించారు. మార్గమధ్యలో పలువురు ఈ బస్సులకు స్వాగతం పలికారు.

పి.గన్నవరం,(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో దేవాలయాల రక్షణ కోసం విజయవాడలో ఆదివారం ఏర్పాటు చేసిన హైందవ శంఖారావానికి అమలాపురానికి చెందిన మట్టపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కె.ఏనుగుపల్లి శిష్యబృందం, భజనబృందం సభ్యులు తరలివెళ్లారు. చంద్రశేఖర్ శిష్య బృందం సభావేదికపై భజనచేశారు. మండలంలోనిపలు గ్రామాల నుంచి ప్రజలు ప్రత్యేక వాహనాల్లో భారీగా తరలివెళ్లారు. శంఖారావానికి వెళ్లినవారిలో నల్లా అజయ్, సానబోయిన సాయిరాం, నిమ్మకాయల శేషు, దొమ్మేటి గణపతి, సానబోయిన రమేష్, చంటి, రాంబాబు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

అమలాపురం టౌన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2024 ఉచిత శిక్షణా తరగతులకు జిల్లాలోని అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి పి.సత్యరమేష్ తెలిపారు. జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ(ఈబ్ల్యుఎస్) కులాలకు చెందిన అభ్యర్థులు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ పొందే అభ్యర్థులు దరఖాస్తులను అమలాపురంలోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు సంబంధించి వంద మంది ఈబీసీ కులాలకు చెందినవారు 20మంది అభ్యర్థులకు రెండు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందిస్తారు. బీఈడీ, టీటీసీతో పాటు ఏపీ టెట్ పరీక్షలో అర్హత సాధించి ఉండాలి. ఏపీ టెట్‌లో అత్యధిక మార్కులు పొందిన వంద మంది అభ్యర్థులకు మాత్రమే అవకాశం దొరుకుతుంది. అభ్యర్థులు తమ బయోడేటా, కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఈనెల 20వతేదీలోపు జిల్లా బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 7093401225, 9440403629 ను సంప్రదించాలని సత్యరమేష్ కోరారు.



పి.సత్యరమేష్

రేపు వికాస ఆధ్వర్యంలో జాబ్‌మేళా



అమలాపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వికాస ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ఉద్యోగార్థులకు వికాస సంస్థ భరోసాగా నిలిచి అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాల కల్పనకు ఎంతగానో శ్రమిస్తుందన్నారు. కలెక్టరేట్‌లోని వికాస సంస్థ జిల్లా కార్యాలయంలో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హుండాయ్ మొబిస్, ఐటెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ వంటి కంపెనీల్లో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. 7వ తేదీ ఉదయం 9గంటలకు అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు అన్నిరకాల ఒరిజినల్ సర్టిఫికెట్లు, విద్యార్హత, ఆధార్ తదితర ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. హెచ్ఆర్ అధికారుల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ తెలిపారు.

అనుమతులు లేకుండా ఆక్వా చెరువుల తవ్వకాలు

అల్లవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మొగళ్లమూరు గ్రామ పరిధిలో అనుమతులు లేకుండా ఐదు ఎకరాల్లో అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాలు జరుగుతున్నాయి. రెవెన్యూ, మత్స్యశాఖల అనుమతులు పొందిన తర్వాతనే తవ్వకాలు జరపాల్సి ఉంది. ఆక్వా చెరువుల తవ్వకాల వల్ల కాలుష్యం పెరిగిపోతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అనుమతులు లేకుండా జరుగుతున్న తవ్వకాలపై జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేసేందుకు గ్రామస్తులు సన్నద్ధమవుతున్నారు. దీనిపై తహశీల్దార్ వీవీఎల్ నరసింహంను వివరణ కోరగా చెరువుల తవ్వకాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే చెరువుల తవ్వకాలు ఆపి వేసేందుకు చర్యలు చేపడతామన్నారు.

యువతి అదృశ్యం

మలికిపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలం సామంతకుర్రుకు చెందిన కాకిలేటి పూజిత మలికిపురం మండలం బట్టేలంక అమ్మమ్మ ఇంటికి వెళ్లి ఈనెల4న అదృశ్యమైనట్లు తండ్రి రామలింగేశ్వరస్వామి ఫిర్యాదు చేసినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కోనసీమ క్రీడోత్సవం

అంబాజీపేట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కోనసీమ క్రీడోత్సవంలో ప్రభుత్వం ఆటలు, ఆరోగ్యం పేరిట మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈనెల 7, 8, 9 తేదీల్లో స్థానిక జిల్లా పరిషత్ క్రీడాప్రాంగణంలో జూనియర్ విభాగంలో 4, 5, 6 తరగుతుల విద్యార్థులకు 100, 200 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్, త్రోబాల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సీనియర్ విభాగంలో 7, 8, 9 తరగతులకు కబడ్డీ, కోకో, క్రికెట్, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తారన్నారు.

ఘనంగా ధనుర్మాస లక్ష తులసి పూజ

అమలాపురం టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దేవతిలకుల భక్త బృందం ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో 13వ ధనుర్మాస లక్షతులసి పూజ భక్త బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు పెద్దింటి వెంకటసత్యనారాయణాచార్యులు, శ్రీనివాసుల విజయగోపాలాచార్యులు, పెద్దింటి పండుస్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. విశ్వక్సేన పూజతో ప్రారంభించి పంచామృతాభిషేకం, బాలభోగనివేదన, గోపూజ, తులసిపూజ, పూర్ణాహుతి, శాంతికల్యాణం తదితర పూజా క్రతవులు నిర్వహించారు. సాయంత్రం అన్నసమారాధన జరిపించారు. దేవస్థానం ప్రతినిధి జంగా అబ్బాయివెంకన్న, ఆలయ ఈవో ఎర్రా వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, దేవతిలకుల భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.



అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస లక్ష తులసి పూజ

వేంకటేశ్వరస్వామికి తులసి పూజ

అంబాజీపేట, జనవరి5(ఆంధ్రజ్యోతి): స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసియున్న శ్రీభూసమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష తులసి పూజ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అర్చకులు పాణింగపల్లి నరసింహాచార్యులు పర్యవేక్షణలో వేదపడింతులు పెద్దింటి వెంకటలక్ష్మి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారిని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దర్శించుకుని పూజలు చేశారు.

వేంకటేశ్వరస్వామికి విరాళాలు

శ్రీవేంకటేశ్వరస్వామికి లక్షతులసి పూజకు కసిరెడ్డి లక్ష్మీనరసింహరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీనివాసరావు రూ.లక్ష, పరసానాగేశ్వరరావు జ్ఞాపకార్థం వారి భార్య శ్రీలక్ష్మికాంతం రూ.లక్ష, మేడిది వెంకటేశ్వరరావు (అబ్బు), అల్లుడు, కుమార్తె మానేపల్లి తాతాయ్యనాయుడు, సీతాఫణి దంపతుల కుమారుడు పుట్టినరోజు సందర్భంగా రూ.1.32లక్షలు, కోట రమేష్, సుమా దంపతులు రూ.లక్ష, రవణం సత్యనారాయణ, వెంకటనర్సాయమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు హరిబాబు రూ.15వేలు విరాళాలుగా అందించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మేడిద శ్రీనివాసరావు, సభ్యులు తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

ముమ్మిడివరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి గోదావరిలో ఈత కొట్టేందుకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తూ నీటి ప్రవాహంలో మునిగి గల్లంతైన అతని మృతదేహం ఆదివారం లభ్యమైంది. ముమ్మిడివరంమండలం కొత్తలంక గ్రామానికి చెందిన మంగ విజయమణికంఠ (19) ఈనెల3న అదే గ్రామానికి చెందిన మంగ జశ్వంత్, పొత్తూరి పార్థసారథిలతో కలిసి కొత్తలంక పంచాయతీ పరిధిలోని కేశనకుర్రురేవు వద్దకు వెళ్లి సరదాగా ఈతకు గోదావరిలో దిగి నదీ ప్రవాహంలో దిగి గల్లంతయ్యాడు. మణికంఠ ఓడలరేవు ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్నాడు. మణికంఠ కోసం బంధువులు, పోలీసులు శుక్ర, శనివారాల్లో గౌతమీ గోదావరిలో నదీ పాయలో గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం కొత్తలంక పుష్కర రేవు వద్ద గోదావరి నదీపాయలో మణికంఠ మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కొత్తలంకకు చెందిన మంగ నాగేశ్వరరావు, మహాలక్ష్మి దంపతుల ఏకైక కుమారుడు మణికంఠ. మణికంఠకు లక్ష్మీనవీన, సాయిశ్రీ సోదరీలు ఉన్నారు. ఒక్కగానొక్క కుమారుడు నదిలో గల్లంతై మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. వారు విలపిస్తున్న తీరు గ్రామస్తులను కంతతడి పెట్టించింది.



బీజేపీ మండల అధ్యక్షుడిగా సురేష్



అంతర్వేది, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సఖినేటిపల్లి మండల విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం ఆదివారం సఖినేటిపల్లి మండల క్షత్రియ కల్యాణ మండపం వద్ద ఆదివారం జరిగింది. పట్టాపు సూర్యప్రకాశరావు అధ్యక్షతన సఖినేటిపల్లి మండల నూతన అధ్యక్షుడిగా అంతర్వేది దేవస్థానానికి చెందిన పోతురాజు సురేష్‌ను, మండల అధికార ప్రతినిధిగా ఉద్దరాజు రామకృష్ణరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సురేష్ నియామకాన్ని మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇందుకూరి అచ్యుతరామరాజు, పర్యవేక్షకుడు అడబాల సత్యనారాయణ ప్రకటించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, రాష్ట్ర కిసాన్ మోర్చాడ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, పట్టాపు సూర్యప్రకాశరావు, మండల బూత్ కమిటీ అధ్యక్షులకు సురేష్ ధన్యవాదాలు తెలిపారు.

అవార్డుల ప్రదానం

ఐ.పోలవరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఐ.పోలవరానికి చెందిన పుల్లెపు తాతయ్య మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో పలువురికి ఆదివారం అవార్డులు ప్రదానం చేశారు. పీటీఎం 17వవార్షికోత్సవంలో భాగంగా ఆదివారం ఐ.పోలవరంలో నిర్వహించిన కార్యక్రమానికి డ్వామా పీడీ కేఎస్‌హెచ్ అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దీపక్ రాజ్‌కు కళాకౌముది అవార్డు, చెల్లి రామ్‌కు ఇంటిగ్రల్ హ్యూమనిస్టు అవార్డు, శెట్టిబత్తుల ఎలిజబెత్‌రాణికి శ్రీశ్రీ సాహిత్య సాగర్ అవార్డు ప్రదానం చేశారు. మరికొంతమందికి బిరుదులు ప్రదానం చేశారు. గాన విభావరి, కవిసమ్మేళనంలో పాల్గొన్న 50మందిని సన్మానించారు. పుల్లెపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సావిత్రీబాయిపూలే అవార్డులు ప్రదానం చేశారు.

రూ.1,63,810 విరాళం

అయినవిల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామిని ఆదివారం హైదరాబాద్‌కు చెందిన బళ్ల దేవిభవానీ-పవన్‌కుమార్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేకపూజల అనంతరం శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.1,6 3,810 విరాళం అందించారు.

హామీలు అమలుచేయాలి

అమలాపురం టౌన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్ల వ్యవస్థను కొనసాగించడంతో పాటు రూ.10వేలు వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చినా ఇంత వరకు వారి గురించి పట్టించుకోకపోవడం శోచనీయమని రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ కె.సత్తిబాబు ఆరోపించారు. నిరుద్యోగులైన వలంటీర్లకు న్యాయం చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందంటూ పట్టణంలోని పలు వార్డుల్లో చైతన్య యాత్ర ఉద్యమ దీప్తి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వరదా వెంకటానంద్ పాల్గొన్నారు.

కుటుంబానికి రక్షణ హెల్మెట్

ఉప్పలగుప్తం, జనవరి 5: హెల్మెట్ ద్విచక్ర వాహనదారుల కుటుంబాలకు రక్షణ కవచమని ఉప్పలగుప్తం ఎస్ఐ చలమల రాజేష్ అన్నారు. గొల్లవిల్లి ఓఎన్జీసీ సెంటర్‌లో ఆదివారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఇటీవల పలు చోట్ల జరిగిన ప్రమాదాల్లో హెల్మెట్ లేనందున తలకు గాయాలతో ప్రాణాలు కోల్పోయిన వాహనదారుల కుటుంబ సభ్యుల దీన పరిస్థితిని ఉదాహరణలతో వివరించారు.

శ్రీశ్రీకళావేదిక సంక్రాంతి సాహిత్య సాంస్కృతిక సంబరాలు



నడక పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రతాప్ తదితరులు

అంతర్వేది, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జనజీవితాలకు దగ్గరగా రాస్తే మంచి కవిత్వం ఉద్భవిస్తుందని, సమాజంలో కవి కలానికి ముందుమాట రాయాలని శ్రీశ్రీకళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో వీవీమెరకలో జరిగిన ముందస్తు సంక్రాంతి సాహిత్య సంబరాలు, దళిత కవుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. జిల్లా కన్వీనర్ డాక్టర్ బీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు కవులు సామాజిక అంశాలపై కవిత్వాన్ని కవితాగానం చేశారు. కార్యక్రమంలో నడక పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం కడలి కెరటాల నాటిక ప్రదర్శన చేశారు. తెలుగు భాషోపాధ్యాయుడు, కవి, రచయిత మాకే బాలార్జున సత్యనారాయణమాట్లాడుతూ దగాపడ్డ జీవితాల నుంచి కవిత్వం పుట్టుకు వస్తుందన్నారు. కవులందరినీ సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, చంద్రశేఖర్, సహజ కవి పొలమూరి వెంకట్, రాజబాబు, కడలి సత్యనారాయణ పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

పి.గన్నవరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): భర్త, అత్తమామలు, ఆడపడుచుల వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన శీలం అర్జునరావు అదే గ్రామానికి చెందిన పావనికుమారిని 2019లో పెద్దల సమక్షంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆరు నెలలు గడిచిన తరువాత భర్త, అత్తమా మలు, ఆడపడుచులు ఆమెను మానసికంగా ఇబ్బంది పెట్టడం, భర్త కూడా శారీరకంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. వారికి 5ఏళ్ల బాబు, మూడేళ్ల పాప ఉన్నారు. ఈనెల2న పాప, బాబు విషయంలో అత్త, కోడలు మధ్య తలెత్తిన వివాదంతో మనస్థాపం చెందిన పావని కుమారి సాయంత్రం ఇంట్లో ఉన్న కలుపు మందు తాగింది. భర్త అర్జునరావు ఆమెను అమలాపురం ప్రైవేటు ఆసుపత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున కుమారి మృతిచెందింది. ఆమె తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు.

ఒలింపియాడ్‌లో సమన్వితకు జాతీయస్థాయిలో పతకం

అల్లవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలం యాటివారిపాలానికి చెందిన యాటి సమన్వితకు యూనిఫైడ్ సైబర్ ఒలింపియాడ్‌లో జాతీయస్థాయిలో బంగారు పతకం లభించింది. ఆమె సాధించిన 221వ ర్యాంకుకు అరుదైన అవకాశం దక్కింది. సమన్వితకు బంగారు పతకంతో పాటు ఒలింపియాడ్‌లో ప్రశంసా పత్రాన్ని అందజేశారు. యాటివారిపాలానికి చెందిన యాటి కృష్ణారావు మనుమరాలైన సమన్విత తల్లిదండ్రులు యాటి అర్జునరావు సివిల్ ఇంజనీర్ కాగా, తల్లి శ్రీదేవి వ్యవసాయశాఖలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం సమన్విత ఏలూరు శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో నాల్గో తరగతి చదువుతోంది. చిన్నారి సమన్విత ఈఘనత సాధించడంతో స్వగ్రామం యాటివారిపాలెం, అల్లవరం గ్రామాల్లో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



సంక్రాంతి సంబరాలు

ఐ.పోలవరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ సాయి స్కూల్లో ఆదివారం భోగి మంట, గంగిరెద్దుల విన్యాసాలు, సరాదా కోడిపందాలు, రంగవల్లులు ఆకట్టుకున్నాయి. స్కూల్ కరస్పాండెంట్ పెన్మెత్స వాసురాజు దంపతులు సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. నాగభట్ల రవిప్రసాద్‌శర్మ పూజా కార్యక్రమాల సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కొలిశెట్టి గంగబాబు, ఉప్పు వాసు, సుంకర నాగబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సినీ నటుడు శ్రీకాంత్ పరామర్శ



అమలాపురం టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు ఎం.శ్రీకాంత్ ఆదివారం అమలాపురంలోని కోనసీమ పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు ఇంటికి వచ్చారు. శ్రీకాంత్ స్నేహితుడైన యాళ్ల రామకృష్ణమూర్తి మాతృమూర్తి ఇటీవల మృతిచెందారు. స్నేహితుడితో పాటు బావ అయిన కృష్ణపద్మరాజును శ్రీకాంత్ పరామర్శించారు. శనివారం రాజమహేంద్రవరంలో జరిగిన గేమ్ చేంజర్ ఫంక్షన్‌కు హాజరైన శ్రీకాంత్ ఉదయం బయలుదేరి అమలాపురం చేరుకుని మధ్యాహ్నం వరకు గడిపారు.

లయన్స్‌క్లబ్ ద్వారా సామాజిక సేవ

మామిడికుదురు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అమలాపురం జోన్ చైర్‌పర్సన్ జి.మల్లికార్జునస్వామి తెలిపారు. అమలాపురం పరిధిలోని ఐదు క్లస్టర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాశర్లపూడి బాడవ వైనతేయ నదీతీరంలో ఆదివారం మల్లెల రమణీయం కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. క్లబ్ సభ్యులందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. క్లబ్ అధ్యక్షుడు ఆర్.వేణుగోపాలరావు, కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, కోశాధికారి పి.వెంకటపతిరాజు, జి.వీరభద్రమణి పాల్గొన్నారు.

మోడల్ టెస్ట్ పేపర్స్ పంపిణీ

రాజోలు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో దాత సహకారంతో 140మంది విద్యార్థులకు పదో తరగతి మోడల్ టెస్ట్ పేపర్స్ ఆదివారం పంపిణీ చేశారు. శివకోడు గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు 76మందికి, శివకోడు జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యా ర్థులు 64మందికి రాజోలు నీటిసంఘం అధ్యక్షుడు పినిశెట్టి బుజ్జి సమకూర్చిన టెస్ట్ పేపర్లను పంపిణీ చేశామని యూటీఎఫ్ జిల్లా సంక్షేమ డైరెక్టర్ ఉండవల్లి శ్రీనివాస్ తెలిపారు.



వాడపల్లి వెంకన్న ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి ఆలయంలో భక్తుల రద్దీ

ఆత్రేయపురం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే స్వామివారికి గోదావరి జలాలను తీర్థపు బిందెతో తీసుకువచ్చి స్నపన మూర్తులకు అభిషేకం చేశారు. అనంతరం తిరుప్పావై వేదపారాయణం నిర్వహించారు. నోము ఆచరించిన భక్తులు అష్టో త్తర పూజలు, నిత్య కల్యాణాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.4,01,557 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు.

50 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల సందడి

ఇదే పాఠశాలలో నేనూ చదువుకున్నా : ఎమ్మెల్యే వేగుళ్ల



గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

మండపేట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండపేటలో వున్న వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ హైస్కూల్లో 1975లో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు 50 ఏళ్ల తర్వాత కలుసుకుని సందడి చేశారు. ఆదివారం ఏడిద రోడ్డులో వున్న ప్రభుత్వ పాఠశాలలో వారంతా అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పదవ తరగతి పూర్తయి 50 ఏళ్ల అయిన నేపథ్యంలో గోల్డెన్ జూబ్లీ వేడుక లను జరుపుకున్నారు. మం డపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కూడా వీరిలో ఒకరు కావడం విశేషం. ఇదే పాఠశాలలో తమతో పాటు చదువు కున్న వారంతా ఉన్నత స్థానాల్లో వున్నారని ఎమ్మెల్యే చెప్పారు. విశ్రాంత ఉపాధ్యా యుడు తెలుగు గణితం ఉపాధ్యాయులు గుంటూరి సాంబ శివరామశర్మ, అద్దంకి వీర్రాజులను సత్కరించారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులకు ఆయన పాదాభి వందనం చేశారు. వచ్చే ఏడాది పదవ తరగతి ఫస్టు క్లాసులో పాసైన విద్యార్థికి రూ.10వేలు నగదు అందజేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగుళ్ల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పూర్వపు విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు హాజరయ్యారు.



ఆత్మీయ సమ్మేళనంలో సందడి చేసిన రాయవరం హైస్కూల్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రాయవరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1979-80 టెన్త్‌క్లాస్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉల్లాసంగా సాగింది. సుమారు 44 సంవత్సరాల తరువాత వారంతా తాము చదువుకున్న పాఠశాలకు చేరుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. దీనికి కృషి చేసిన వారిని సత్కరించారు. అనంతరం వారంతా భోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆర్‌వీవీ సత్యనారాయణ చౌదరి, తాడి వెంకట లక్ష్మినారాయణరెడ్డి, మల్లిడి సూరారెడ్డి తదితరులను పూర్వ విద్యార్థులు అభినందించారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం: పాఠశాల అభివృద్ధికి రూ.6లక్షల విరాళం అందజేయనున్నట్లు పూర్వ విద్యార్థి సత్యనారాయణ చౌదరి తెలి పారు. పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి 6లక్షలు అందిస్తున్నట్టు తెలిపారు.

భద్రతపై ఆటోడ్రైవర్లు దృష్టిపెట్టాలి



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

కొత్తపేట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని రోడ్డు భద్రతపై దృష్టిపెట్టాలని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ పేర్కొన్నారు. ఆదివారం కొత్తపేట స్టేషన్ ఆవరణలో ద్విచక్ర వాహనదారులు, ఆటోడ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలన్నారు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనం తరం మోటార్ మెకానిక్‌లతో సమావేశమై వారిచే హెల్మెట్ ధరించాలనే ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. మోటార్ వాహనాలు రిపేర్లు చేయించుకోవడానికి వచ్చే ద్విచక్ర వాహనదారులందరికి హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించాలని సూచించారు.



వీరస్వామిని సత్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

విశ్రాంత ఉద్యోగుల సామాజిక సేవ స్ఫూర్తిదాయకం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 5(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సామాజిక సేవ స్ఫూర్తిదాయకమని వక్తలన్నారు. ఆదివారం విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య కార్యాలయంలో సమాఖ్య అధ్యక్షుడు పట్నాల రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఐసీఐసీఐ బ్యాంకు మేనేజరు వై. నవీన్ విశ్రాంత ఉద్యోగులకు తమ బ్యాంకు అందచేస్తున్న సేవలు తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య కార్యాలయం వినియోగార్థం కంప్యూటర్ సమకూర్చిన విశ్రాంత అధ్యాపకుడు తుంగా వీరాస్వామిని సత్కరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలి

ఆత్రేయపురం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని సీఐ విద్యాసాగర్ పేర్కొన్నారు. ఆదివారం ఆత్రేయపురం రేవులో పలు వాహనాలను తనిఖీ చేసి హెల్మెట్ లేకుండా ప్రయాణించే వాహనదారులకు పలు సూచనలు చేశారు. కుటుంబ సభ్యులను గుర్తు పెట్టుకోవాలని ఆయన హితవుపలికారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణంతకమని ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.రాము, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ విద్యాసాగర్

వెలిచేరు-బొబ్బర్లంక రోడ్డుకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆత్రేయపురం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం వెలిచేరు నుంచి బొబ్బర్లంక వరకు ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వానంగా మారడంతో ఆంధ్రజ్యోతిలో ఇటీ వల వెలువడిన కథనాలపై అధికారులు స్పందించారు. ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు రోడ్డు మరమ్మతు పనులకు నిధులు మంజూరుకు కృషి చేశారు. వెలిచేరు నుంచి బొబ్బర్లంక వరకు రూ.35 లక్షలతో మరమ్మతులు చేపట్టేలా టెండర్లు పిలిచారు. ఈ నేప థ్యంలో ఆదివారం మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఆర్‌అండ్‌బీ ఏఈ మణికుమార్ పర్యవేక్షణలో రోడ్డు మరమ్మతు పనులు శరవేగంగా చేపడుతున్నారు. దీంతో వాడపల్లి వెంకన్న ఆలయానికి వచ్చే భక్తుల రాకపోక లకు ఎంతో సులభతరం కానుంది.



వెలిచేరు వద్ద ఆర్‌అండ్‌బీ రహదారికి మరమ్మతులు చేస్తున్న దృశ్యం





కొత్తపేటలో హైందవ శంఖారావానికి తరలివెళ్లిన బీజేపీ నేతలు. పక్క చిత్రంలో రామచంద్రపురంలో శంఖారావానికి వెళుతున్న దృశ్యం

హైందవ శంఖారావానికి తరలిన జనం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 5(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆదివారం జరిగే హైందవ శంఖారావానికి రామచంద్రపురం నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో హిందువులు వెళ్లారు. ముప్పై బస్సుల్లో 1500 మంది శంఖారావానికి వెళ్లారు. విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో బయలుదేరిన బస్సులకు చెరుకుపల్లి గణేష్‌శర్మ, వడ్డి సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి హైందవ శంఖారావానికి వెళ్లారు.

రావులపాలెం: విజయవాడ హైందవ శంఖరావం సభకు రావులపాలెం మండలం నుంచి అధిక సంఖ్యలో హిందువులు వెళ్లారు. ఈతకోట జాతీయ రహదారి సెంటర్ వద్దకు చేరుకున్న వారంతా జై శ్రీరామ్ నినాదాలతో బస్సుల్లో వెళ్లారు. కార్యక్రమంలో అప్పన గణపతిరావు, గొని మడతల కనకరాజు, గండ్రోతు వీరగోవిందరావు, పి.శ్రీనివాస్, కాండ్రేగుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: విజయవాడలో నిర్వహించిన హైందవ శంఖారావానికి కొత్తపేట మండలం నుంచి పెద్దఎత్తున హిందువులు బస్సులు, కార్లలో వెళ్లారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ళ దొరబాబు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం జెండా ఊపి ర్యాలిని ప్రారంభించారు. భక్తులు జై శ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. అధిక సంఖ్యలో మహిళలు విజయవాడ వెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోకా వెంకట సుబ్బారావు, సంపతి కనకేశ్వరరావు, కోటిపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: విజయవాడలో జరుగుతున్న హైందవ శంఖారావం సభకు మండలం నుంచి హిందువులు వెళ్లారు. భారతీయ జనతా పార్టీ, హిందూ సంఘాల ఆధ్వర్యంలో బస్సుల్లో అధిక సంఖ్యలో ప్రజలు వెళ్లారు. భారతీయ జనతా పార్టీ నాయకులు కర్రి చిట్టిబాబు, సలాది శేఖర్, అవసరాల నారాయణమూర్తి, కవులూరి వెంకట కృష్ణ తదితరులు విజయవాడ బయలుదేరిన వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు.

మండపేట: విజయవాడ హైందవ శంఖారావం సభకు మండపేట నియోజకవర్గం నుంచి బీజేపీ శ్రేణులు బస్సుల్లో బయలుదేరారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.సాయిరాం ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు అధిక సంఖ్యలో వెళ్లారు.



ఎమ్మెల్యే వేగుళ్లను కలిసిన టీడీపీనేత మసేను

వేగుళ్లను కలిసిన రేవు శ్రీను

మండపేట, జనవరి 5(ఆంధ్రజ్యోతి) మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియర్‌నేత పప్పల మసేను (రేవు శ్రీను) ఆదివారం పార్టీ కార్యాలయంలో కలిశారు. రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో మండపేట మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ తదితరులు వున్నారు.

రేపు వికాస ఆధ్వర్యంలో జాబ్‌మేళా

అమలాపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వికాస ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ఉద్యోగార్థులకు వికాస సంస్థ భరోసాగా నిలిచి అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాల కల్పనకు ఎంతగానో శ్రమిస్తుందన్నారు. కలెక్టరేట్‌లోని వికాస సంస్థ జిల్లా కార్యాలయంలో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హుండాయ్ మొబిస్, ఐటెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ వంటి కంపెనీల్లో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. 7వ తేదీ ఉదయం 9గంటలకు అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు అన్నిరకాల ఒరిజినల్ సర్టిఫికెట్లు, విద్యార్హత, ఆధార్ తదితర ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. హెచ్‌ఆర్ అధికారుల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ తెలిపారు.



ఆలమూరులో రంగవల్లుల పోటీలు నిర్వహించిన దృశ్యం

కోలాహలంగా రంగవల్లుల పోటీ

ఆలమూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఆలమూరు అయ్యప్పస్వామి మకరజ్యోతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ గ్రామాల మహిళలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. సీనియర్స్, జూనియర్స్ విభాగంలో పోటీలు జరిపారు. న్యాయ నిర్ణేతలు ముగ్గులను పరిశీలించారు. సీనియర్స్ విభాగంలో మూలస్థానానికి చెందిన దుర్గ ప్రథమ, నేలటూరుకు చెందిన విజయభారతి ద్వితీయ, ఆలమూరుకు చెందిన యు.లక్ష్మీలావణ్య, టీ.వి ద్యాబాను తృతీయస్థానాలు సాధించారు. జూనియర్స్ విభాగంలో ఆలమూరుకు చెందిన పి.దుర్గ ప్రథమ, రాజమహేంద్రవరానికి చెందిన యు.జాహ్నవి ద్వితీయ, ఆలమూరుకు చెందిన వెంకటలక్ష్మి తృతీయస్థానాలు సాధించినట్లు ప్రకటించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

13న గోదాదేవి కల్యాణ ఏర్పాట్లు పరిశీలన



గోదాదేవి కల్యాణానికి ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈవో చక్రధరరావు

ఆత్రేయపురం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భోగి పండగతో ధనుర్మాస ఉత్సవాలు ముగియనున్నాయి. 13న ఉదయం శ్రీనివాస ప్రాంగణంలో గోదా రంగనాథుల కల్యాణం నిర్వహించనున్నారు. పెళ్లికాని వారు గోదాదేవి కల్యాణంలో పాల్గొంటే ఫలితం దక్కుతుందని భక్తుల నమ్మకం. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పెళ్లికాని వారు కల్యాణోత్సవంలో పాల్గొంటారు. రూ.750 టిక్కెట్టు పొంది పూజా సామగ్రితో కల్యాణంలో పాల్గొనాలి. కల్యాణ వేదికకు భారీ సెట్టింగ్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు వీటిని వీక్షించేలా తగిన ఏర్పాట్లను ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పరిశీలించారు. గోదాదేవి కల్యాణానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చురుకుగా చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేత్రదానం పట్ల హర్షం

కె.గంగవరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పామర్రులో కుడుపూడి సీతారత్నం నేత్రదానం చేశారు. ఆమె అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రాదానం చేశారు. కాకినాడ బాదం బాలకృష్ణ ఐబ్యాంకు ప్రతినిధులు ఆమె నేత్రాలు సేకరించారు. వారి కుటుంబ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.



రాయవరం పోలమ్మ అమ్మవారు (ఫైల్‌ఫొటో)

19న పోలమ్మ ఉత్సవాలు

రాయవరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామ దేవత పోలమ్మ అమ్మవారి ఉత్సవాలు ఈనెల 19 నుంచి 21 వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నౌడు వెంకటరమణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 19న శ్రీముత్యాలమ్మ జాతర, 20న పోలమ్మ జాతర, 21న అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి ఏడాది సంక్రాంతి తరువాత వచ్చే మంగళవారం అమ్మవారి తీర్థం నిర్వహిస్తున్నామని తెలిపారు.

సంక్రాంతికి ఊరెళ్లే వారు జాగ్రత్తలు తీసుకోవాలి

రాయవరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని దూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు సూచించారు. ఆదివారం రాయవరంలో ఆయన మాట్లాడుతూ పండుగ సెలవులకు ఊరికి వెళ్లే సమయంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు ఇంటి చిరునామ, ఫోన్ నెంబరును పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఊరికి వెళ్లే వారి వివరాలు నమోదు చేసుకుని వారి ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు ముందుగా తెలియజేస్తే లాక్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహించడం తగదు

రాయవరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): 2010లో సదరం ధ్రువపత్రాలు అందించిన దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం మళ్లీ వైద్య పరీక్షలు నిర్వహించడం తగదని అఖిల భారత దివ్యాంగ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి భరత్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని వెంటూరులో ఆయన మాట్లాడుతూ 2019-24 మధ్య దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించడాన్ని స్వాగతిస్తామన్నారు. నకిలీ పింఛన్లు పొందుతున్న వారిని ఏరివేస్తే అభ్యంతరం లేదన్నారు. తనిఖీల పేరుతో అర్హులైన దివ్యాంగులను వేధిస్తే ఉద్యమానికి పిలుపునిస్తామన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

అక్రమ ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

ఆలమూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జొన్నాడలో ఉచిత ఇసుక పేరుతో కూటమి నాయకులు పాల్పడిన అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోవాలని కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వైసీపీ నాయకులతో కలిసి జొన్నాడలోని ఇసుక నిల్వలను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలను చూపించి ఇప్పటికైనా చంద్రబాబు కళ్లు తెరవాలన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. సమావేశంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.